క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ : పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శనివారం అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ పాల్గొన్నారు. నవరాత్రులు భక్తులచే పూజలందుకున్న దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలన్నారు.ఈ కార్యక్రమంలో నీల రవి, ఆలంపల్లి నర్సింహ, మల్లయ్య, చీదెళ్ల వెంకటేశ్వర్లు, రాములు, బాలు, తదితరులు ఉన్నారు.

అమ్మవారి చీరలు, కలశాలు వేలం

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణంలోని ముత్తిరెడ్డికుంటలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి చీరలు, కలశాలకు శనివారం వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా 11 రోజుల చీరలు వేలం పాట పడగా మొదటి కలశాన్ని సింగారపు మధు లక్ష్మీదేవి రూ.7016, రెండవ కలశం సరస్వతి రూ.4216 మచ్చ వెంకటేశ్వర్లు, మూడో కలశం రాజరాజేశ్వరీ రూ.11016 శ్రీరామోజు వెంకటాచారిలు కైవసం చేసుకున్నారు. అదే విధంగా అమ్మవారి శోభయయాత్రను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులున్నారు.

నీటి సమస్య పరిష్కరించిన మాజీ ఎంపీపీ



బోరు వేయిస్తున్న మాజీ ఎంపీపీ ఏర్పుల గోవిందుయాదవ్

చందంపేట : మండలంలోని కంబాలపల్లిలో గ్రామస్తులు నీటి సమస్యతో బాధపడుతున్నారన్నా విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ ఏర్పుల గోవింద్ యాదవ్ దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్ సహకాం, సొంతఖర్చుతో బోరు వేయించారు. అలాగే విద్యుత్ మోటారును బిగించి నీటి కొరతను తీర్చారు. నీటి సమస్య పరిష్కరించడంతో గ్రామస్తులు మాజీ ఎంపీపీ ఏర్పుల గోవిందుయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు చిమట ముత్తయ్య, రంగయ్య, శశి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా నిర్మించిన చర్చీలను తొలగించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కొల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్‌లో 14లో అక్రమంగా నిర్మించిన చర్చీలను తొలగించాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు బీజేపీ నాయకులుఉ ఎంపీడీఓ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ మైకులు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేసి ఇబ్బందులు కలిగిస్తున్నారని, ప్రధాన రహదారిపై అడ్డంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేయడం సబబు కాదని పేర్కొన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఏరుకొండ రాము, గణపురం రాంబాబు, జితేందర్, గోపి, లక్ష్మణ్, కిశోర్ తదితరులున్నారు.

ఆరోపణలు చేయడం సబబు కాదు



మాట్లాడుతున్న అభిషేక్‌నాయక్

కొండమల్లేపల్లి : మండలంలో బీఆర్ఎస్ పార్టీకి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకుడు ఇస్లావత్ అభిషేక్ నాయక్ ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలోని పాల శీతలీకరణ కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక ఎన్నికల సందర్భంగా బీఆర్ఎస్‌కు వస్తున్న ఆదరణను తట్టుకోలేకపోతున్నారని, ఇటీవల అధిక వడ్డీకి ఆశపడి బాలాజీనాయక్ డబ్బులు ఇస్తే అందుకు తాను ఏజెంట్‌గా వ్యవహరించానని ఆరోపించడం సబబు కాదన్నారు. ఈ సమావేశంలో జబ్బు యాదయ్య, రమావత్ దీప్లా నాయక్, వద్యబలరాంనాయక్, పాండు, శ్రీను, సురేష్, రమేష్, రావుల సత్యనారాయణ,సత్యం పాండు తదితరులున్నారు.

సబ్ మార్కెట్ లేక అవస్థలు

- ప్రతిపాదనలకే పరిమితం
- స్థలసేకరణ, సర్వేలతోనే సరి
- ధాన్యం అమ్ముకోవడంలో రైతులకు ఇబ్బందులు



గుర్రంపోడు : ఇళ్ల వద్దనే పత్తిని దళారులకు అమ్ముకుంటున్న రైతులు



తానేదార్‌పల్లి వద్ద సబ్‌మార్కెట్ ప్రతిపాదిత స్థలం

గుర్రంపోడు : మండలంలో ఖరీఫ్ దిగుబడులు రావడం ప్రారంభమయ్యాయి. పత్తి తీతలు, వరికోతలు మొదలైనా ధాన్యం కొనుగోలు కేంద్రాలు, పత్తి కొనుగోలు కేంద్రాలు లేక రైతులు దళారులకు తుక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి, నిల్వ చేసుకోవడానికి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రంలో సబ్ మార్కెట్ ఉంటే అక్కడే ధాన్యాన్ని అమ్ముకోవడం కాని కొద్ది రోజుల వరకు షెడ్‌ల క్రింద నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉండేది. అకాల వర్షాలకు బయపడి రైతులు ధాన్యాన్ని నిల్వ చేసుకోలేక ఏదో ఒక ధరకు దళారులకు అమ్ముకుంటున్నారు. ఇదే అదునుగా దళారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. రైతుల వద్ద సేకరించిన ఉత్పత్తులను ధర పెరిగినప్పుడు మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

సబ్ మార్కెట్ ఏర్పాటు ఎప్పుడో..

మండలకేంద్రంలో సబ్ మార్కెట్ ఏర్పాటు కలగానే మిగులుతుంది. రెండు దశాబ్దాలుగా సబ్ మార్కెట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు, స్థల సేకరణ సర్వేలకే పరిమితమైంది. పరిసర మండలాలన్నింటిలో సబ్ మార్కెట్ ఉన్నా ఇక్కడ లేకపోడవంపై స్థానిక ప్రజాప్రతినిధులపై రైతుల నుంచి ఒత్తిడి పెరుగుతుంది. ఎన్నికల సందర్భాల్లో సబ్ మార్కెట్ ఏర్పాటు చేస్తామని నాయకులు హామీ ఇస్తూనే ఉన్నారు. ప్రభుత్వం వరి కొనుగోలు కేంద్రాలు సీజన్‌లో ఏర్పాటు చేస్తున్నా అపరాల వంటి పంటల దిగుబడులు అమ్ముకోవడానికి పక్క మండలాలైన చందూరు, హాలియా మార్కెట్‌లకు వెళ్లాల్సి వస్తుంది.

రికార్డు స్థాయిలో దిగుబడులు

మండలం ఏఎమ్మార్పీ ఆయకట్టు పరిధిలో ఉండటం , గతేడాది నుంచి నిరాటంకంగా రెండు పంటలకు నీటి విడుదల జరుగుతుండటంతో పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. దీంతో ప్రధానంగా వరి దిగుబడులు గణనీయంగా పెరిగాయి. మండలంలో రికార్డు స్థాయిలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 26,750 ఎకరాల్లో వరిసాగు జరిగింది, పత్తి పంట 40వేల ఎకరాల్లో సాగవుతుంది. జిల్లాలో విస్తీర్ణంలో పెద్ద మండలంగా గుర్తింపు ఉండి పంట దిగుబడులు గణనీయంగా పెరిగినా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకోవడానికి అవస్థలు పడుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

మండలకేంద్రం నుంచి నాంపల్లి రోడ్డులో ఏఎమ్మార్పీ ఖాళీ స్థలంలో గతంలో సబ్‌మార్కెట్ యార్డుకు ప్రతిపాదనలు జరిగినా స్థల సేకరణలో సమస్యలు ఎదురవడంతో అంతటితో ఆగిపోయింది. ఆ తర్వాత నల్లగొండ -దేవరకొండ ప్రధాన రహదారి పక్కనే తానేదార్‌పల్లి గ్రామ శివారులో 12ఎకరాల స్థలంలో సర్వే జరిగినా ముందుకు సాగలేదు. ఇక్కడ స్థలసేకరణకు ఎలాంటి సమస్య లేదు. మండలకేంద్రానికి కేవలం నాలుగు కిలోమీటర్ల దూరంలో నల్లగొండ- దేవరకొండ ప్రధాన రహదారి పక్కనే సబ్ మార్కెట్ ఏర్పాటైతే రైతులకు ఎంతో ప్రయోజకరంగా ఉంటుంది.

సబ్ మార్కెట్ ఏర్పాటు చేయాలి



పరిసర మండలాలన్నింటిలో సబ్‌మార్కెట్‌లు ఉన్నా ఇక్కడ సబ్ మార్కెట్ లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవరకొండ మార్కెట్ పరిధిలో ఉన్న ఈ మండలం నుంచి రైతులు పక్క మండలాలకు సబ్ మార్కెట్‌లకు తమ ఉత్పత్తులను అమ్ముకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. తాను గతంలో మార్కెట్ కమిటీ డైరక్టర్‌గా ఉన్నప్పుడే స్థల సేకరణ ప్రయత్నాలు జరిగాయి. అధికారులు, ప్రజాప్రతినిధుల సబ్ మార్కెట్ ఏర్పాటుపై శ్రద్ధ చూపాలి.

– వెలుగు రవి, రైతు, గుర్రంపోడు

సబ్‌మార్కెట్ ఏర్పాటుకు కృషిచేస్తా



మండలకేంద్రంలో సబ్ మార్కెట్ ఏర్పాటుకు తన వంతుగా కృషిచేస్తా. ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకువచ్చి సబ్ మార్కెట్ మంజూరు చేయిస్తా. మండలంలో పెరిగిన పంటల సాగుకు అనుగుణంగా రైతులు తమ ఉత్పత్తులను అమ్ముకుని మద్దతు ధర పొందాలంటే సబ్ మార్కెట్ యార్డు అవసరం. తానేదార్‌పల్లి వద్ద గల ప్రభుత్వ స్థలంలో సబ్ మార్కెట్ ఏర్పాటు విషయమై మార్కెట్ కమిటీ పాలక మండలి సమావేశాల్లో చర్చిస్తాం . త్వరలోనే మండలకేంద్రంలో సబ్‌మార్కెట్ మంజూరుకు కృషి చేస్తా.

– తగుళ్ల సర్వయ్య, దేవరకొండ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్

ప్రతి ఒక్కరూ దైవ చింతన అలవర్చుకోవాలి



ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో దైవ చింతన అలవర్చుకోవాలని తద్వార మానసిక ప్రశాంతత చేకూరుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో కొలువుదీరిన దుర్గామాత మండపం వద్ద ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. దుర్గామాత అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరాజ్‌ఖాన్, పల్లా నర్సింహారెడ్డి, మారుపాకుల సురేష్‌గౌడ్, ముత్యాల సర్వయ్య, జాన్‌యాదవ్, తదితరులున్నారు.

ఆ కుటుంబాలకు టికెట్లు ఇవ్వొద్దు : వేనేపల్లి

మిర్యాలగూడ టౌన్ : ప్రజా ప్రతినిధులు పదవి కాలం మధ్యలో చనిపోతే వారి కుటుంబ సభ్యులకు ఇవ్వవద్దని ఆలగడప మాజీ సర్పంచ్, తెలంగాణ మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు అన్నారు. శనివారం మిర్యాలగూడ మండలం ఆలగడప వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు ఎవరైనా చనిపోతే వారి కుటుంబ సభ్యులకు టికెట్లు ఇచ్చే సంస్కృతిని విడనాడాలని అన్నారు. ఈ మార్పునకు జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచే స్వస్థిపలకాలన్నారు. సొంత అనేది కుటుంబానికి మాత్రమే కానీ రాజకీయానికి కాదని, ఈ వ్యవస్థకు ఫులిస్టాప్ పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న వేనేపల్లి పాండురంగారావు

వన్యప్రాణులను సంరక్షించాలి

చందంపేట : వన్య ప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కంబాలపల్లి రేంజ్ ఫారెస్ట్ ఇన్‌చార్జి ఆఫీసర్ సుమన్ అన్నారు. వన్యప్రాణుల వారోత్సవాల్లో భాగంగా శనివారం చందంపేట మండలం కంబాలపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. వన్య ప్రాణుల సంరక్షణ, అటవీ చట్టాలు, అటవీ జంతువులపై దాడికి పాల్పడితే చర్యలు–చట్టాలు తదితర విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు, కిరణ్‌కుమార్, బీట్ అధికారులు, దేవరకొండ రేంజ్ సిబ్బంది ఉన్నారు.



వన్య ప్రాణుల వారోత్సవాల్లో పాల్గొన్న ఫారెస్ట్ అధికారులు, సిబ్బంది

సుమిత్రబాయికి పలువురి నివాళి

మిర్యాలగూడ అర్బన్ : సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేశ్ సతీమణి సుమిత్రబాయి అంత్యక్రియలు శనివారం ముగిసాయి. ఆమె అంత్యక్రియల్లో పలువురు రాజకీయ నాయకులు పాల్గొని నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, నల్లమోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు చెరుపల్లి సీతారాములు, అలుగుబెల్లి నర్సిరెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మల్లు లక్ష్మీ సుమిత్రబాయ్ మృతదేహాన్ని సదర్శించి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం నాయకులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, చినపాక లక్ష్మీనారాయణ, సయ్యద్, హాసం, కందాల ప్రమీల, పాలడుగు నాగార్జున, ప్రభావతి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, ఇండియన్ లాయర్స్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శంకరయ్య, సూర్యాపేట జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, జగదీశ్‌చంద్ర, పారేపల్లి శేఖర్‌రావు, సత్తయ్య, రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, పోలేబోయిన వరలక్ష్మి, సీతారాములు, వినోద్, అయ్యుబ్ తదితరులు పాల్గొన్నారు.



సుమిత్రబాయ్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు

గుండెపోటుతో వ్యక్తి మృతి



రావుల రవి (ఫైల్)

కొండమల్లేపల్లి : ఇంట్లో ఒంటరిగా ఉన్న వ్యక్తి గుండెపోటుతో మృతిచెందాడు. ఈ ఘటన కొండమల్లేపల్లి మండలం చిన్నఅడిశర్లపల్లి గ్రామంలో శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నఅడిశర్లపల్లి గ్రామానికి చెందిన రావుల రవి(26) కొండమల్లేపల్లిలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. దసరా పండుగను అక్క అనిత, భార్య శివానితో కలిసి ఆనందంగా జరుపుకున్నాడు. అనంతరం భార్యను ఆమె పుట్టింట్లో, అక్కను దేవతపల్లి గ్రామంలో బైక్‌పై దించి వచ్చాడు. శుక్రవారం చిన్నఅడిశర్లపల్లిలో ఒంటరిగా తన ఇంటి మిద్దె మీద నిద్రించాడు. శనివారం రవికి అతడి అక్క, భార్య ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో భార్య శివాని ఇంటికి వచ్చిచూడగా మిద్దె మీద రవి విగతజీవిగా పడి ఉన్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి అక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.

వ్యక్తిగత విషయాలు పార్టీకి ఆపాదించొద్దు



మాట్లాడుతున్న దస్రూనాయక్

కొండమల్లేపల్లి : వ్యక్తిగత విషయాలను పార్టీకి ఆపాదించడం సబబు కాదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పాల శీతలీకరణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీకి మచ్చతెచ్చే వారు ఎంతటివారైనా సరే ఉపేక్షించేది లేదన్నారు. శనివారం ఒక పత్రికలో ప్రచురితమైన కథనాన్ని ఆయన ఖండించారు. అధిక వడ్డీలతో ప్రజలను మోసం చేస్తే, వారిని పార్టీ సస్పెండ్ చేస్తుందని, తప్పు చేస్తే కన్న కూతురునే కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేశారని గుర్తు చేశారు. పార్టీ సిద్ధాంతాలకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రమావత్ రమేష్‌నాయక్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కోటేష్, హరికృష్ణ, వెంకటేష్,నాని తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దుర్గాదేవి శోభాయాత్ర

హాలియా : హాలియా మున్సిపాలిటీ పట్టణంలో ఏర్పాటు చేసిన పలు ఉత్సవ కమిటీ సభ్యులు శనివారం దుర్గాదేవి శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 11రోజులపాటు వివిధ రూపాల్లో దుర్గా మాతను పూజించి శోభాయాత్రను నిర్వహించారు. హాలియా పట్టణంలోని పురవీధుల గుండా డప్పు వాయిద్యాలు, కోలాటం, భజనలతో పాటు ప్రత్యేక ఆకర్షనీయంగా తీర్చిదిద్దిన ట్రాక్టర్‌పై అమ్మవారిని ఊరేగించారు. అనంతరం సాగర్ ప్రాజెక్టులో దుర్గామాత విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో దుర్గాదేవి ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



హాలియా : శోభాయాత్రలో అమ్మవారు



దుర్గాదేవి అమ్మవారు

త్రిపురారం : మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో దుర్గా మాతా శోభాయాత్ర భక్తులు శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని విద్యా నగర్ కాలనీలో దుర్గామాతాను నిమజ్జనానికి తరలించే కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి గ్రామ వీధుల్లో రేగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలకు, నిర్వహకులు, భవానీ స్వాములు తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లిలో అమ్మవారి శోభాయాత్ర

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి శోభాయాత్ర అంగరంగ వైభవంగా సాగింది. ఈ శోభయాత్రలో ఆలయ నిర్మాణ కర్త బంటు వెంకటేశ్వర్లు, కంచచర్ల రమేష్, గార్లపాటి రవీందర్ రెడ్డి, గార్లపాటి రంజిత్‌రెడ్డి, ఉపేందర్ దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు నాగేంద్రశర్మ, రేణుక బంటు, దేవి వరప్రసాద్, రేణుక, పల్లా శ్రీనులతో పాటు 60 మంది కోలాట మహిళా బృందాలు తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ టౌన్ : యాద్గార్‌పల్లిలో అమ్మవారి శోభయాత్రలో పాల్గొన్న భక్తులు



త్రిపురారం : విద్యానగర్ కాలనీలో..

భూ నిర్వాసితుల ధర్నాను జయప్రదం చేయాలి

గట్టుప్పల్ : ఈనెల 6న హైదరాబాద్‌లోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం కోరారు. శనివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో జరిగిన ఆ పార్టీ ముఖ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గట్టుప్పల్, తేరట్‌పల్లి, నామాపురం, వెల్మకన్నె గ్రామాల్లోని రైతులకు చెందిన కొన్ని వందల ఎకరాల పట్టా భూములు ట్రిపుల్ ఆర్ విస్తరణలో కోల్పోతున్నారని అన్నారు. వారందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చాపల మారయ్య, కర్నాటి మల్లేశం, కర్నాటి సుధాకర్, కర్నాటి వెంకటేశం, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, పెద్దగాని నరసింహ, ఖమ్మం రాములమ్మ, విశ్వనాథం పాల్గొన్నారు.

అన్ని స్థానాలు గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీచేసిన జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలన్నీ గెలిచి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి కోరారు. శనివారం నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశంలో భూపాల్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, దీన్ని ఎన్నికల్లో ప్రచారం చేయాలన్నారు. ఎన్నికలను వాయిదా వేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు కటికం సత్తయ్య గౌడ్, వంగాల సహదేవరెడ్డి, కరీం పాషా, గోనా రవీందర్‌రావు, అయితగోని యాదయ్య, రామగిరి శ్రీధర్ రావు, జొన్నలగడ్డ శేఖర్ రెడ్డి, కదారి కృష్ణయ్య పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగునీరు

పెద్దవూర : గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. వీధుల్లో ఎక్కడ చూసినా రోడ్లపైనే పారుతున్న డ్రెయినేజీల నుంచి వచ్చే దుర్వాసనతో కూడిన మురుగునీరు దర్శనమిస్తున్నాయి. కలెక్టర్ పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశిస్తున్నా గ్రామాల్లో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మండలంలోని సంగారం, జయరాంతండా, పులిచర్ల, పెద్దగూడెం, లింగంపల్లి, శిర్సనగండ్ల తదితర గ్రామాల్లో సీసీ రోడ్లు చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించినా వాని వెంట మురుగు కాల్వలు లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు వీధుల్లో పారుతుంది. వీనికి చిన్నపాటి వర్షం నీరు తోడైనా వీధులన్ని చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపై నిలిచిన మురికి నీటిలో నుంచే వెళ్లాల్సి వస్తుంది.



సంగారంలో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు



సంగారంలో రోడ్డుపై నిలిచిన మురుగు



వెల్మగూడెంలో..



పెద్దగూడెంలో వీధిలో నిలిచిన మురుగు

నేత్రదానం గొప్ప విషయం

కనగల్: నేత్రాలు దానం చేయడం చాలా గొప్ప విషయమని నల్లగొండ లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. కనగల్ మండలంలోని బాలసాయిగూడెం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏమిరెడ్డి సైదిరెడ్డి తండ్రి ఏమిరెడ్డి చెన్నారెడ్డి (85) శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మృతుడి నేత్రాలను కుటుంబ సభ్యులు నల్లగొండ లయన్స్ క్లబ్ వారికి దానం చేశారు. ఈ సందర్భంగా నేత్రాలు స్వీకరించిన క్లబ్ సభ్యులు మాట్లాడారు. దానం చేసిన ఐ కార్నియాలతో ఇద్దరు అంధులకు కంటిచూపు తేవచ్చన్నారు. మృతుడు చెన్నారెడ్డి నేత్రాలను దానం చేసిన ఆయన కుమారుడు సైదిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నిమ్మల పిచ్చయ్య, ఎర్రమాద అశోక్, వేముల సాయికుమార్, మండడి శంకర్‌రెడ్డి, జానీ, బోధనం సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

నల్లగొండ: కేంద్ర నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌశల్ దీక్షాంత్ సమారోహ్ (నైపుణ్య స్నాతకోత్సవ వేడుక 2025)లో సీటీఎస్ మెయిన్స్–2025 పరీక్షలో ట్రేడ్ వైజ్ టాపర్‌గా నిలిచిన నల్లగొండ ఐటీఐ కళాశాలకు చెందిన ఆడెపు అశ్విని ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శనివారం ఆమెను ఐటీఐ కాలేజి ప్రిన్సిపల్ నర్సింహాచారి ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో అశ్వనితల్లి నర్సమ్మ, సురేందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.



అశ్వనిని సన్మానిస్తున్న ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు